నేడు కడపకు మంత్రుల బృందం రాక

-టిడిపి మహానాడు స్థల పరిశీలనకు పర్యటన

ప్రజాశక్తి - కడప అర్బన్ : టిడిపి ప్రతిష్టాత్మక మహానాడు స్థల పరిశీలనలో భాగంగా కడపకు సోమవారం పలువురు మంత్రులు, నేతలు రానున్నారు. కడపలో మేలో మహానాడు కార్యక్రమం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో స్థల పరిశీలనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి రానున్నట్లు పార్టీ నేతలకు సమాచారం అందింది. రెండు, మూడు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించి పార్టీ అధిష్ఠానానికి నివేదించనున్నారు. అనంతరం తుది నిర్ణయం తీసుకుంటారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించనున్నారు. ఈ నెల 11న నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దంపతులు పట్టువస్త్రాల సమర్పణ సన్నాహాలపై అధికారులతో చర్చించనున్నారు.

మృత్యుంజయకుంట

మూగవేదన వినేదెవరు

- మౌలిక వసతుల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం
- వర్షాకాలంలో ముంపులోనే జనజీవనం
- సిసి రోడ్లు, డ్రెయినేజీ సమస్యలకు కేరాఫ్
- పక్కాగృహాలు, పింఛన్ల కోసం నిరీక్షణ
- పాలకులకు పట్టని మౌలిక సమస్యలు

కడప కార్పొరేషన్‌లోని మృత్యుంజయకుంట మౌలిక వసతుల లేమితో మూగవేదన అనుభవిస్తోంది. నాలుగున్నర దశాబ్దాలుగా సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు ఏర్పాటు చేయకపోవడంతో జనం జంకుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చిన్నపాటి వర్షం కురిస్తే ముంపుజలాలతో రోడ్లు బావులను తలపిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థజలాలతో సహజీవనం చేయడం మృత్యుంయజకుంటకు పరిపాటిగా మారింది. స్థానిక సంస్థల, సార్వత్రిక ఎన్నికలు సమయాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు వేయిస్తామని నమ్మబలకడం, అనంతరం అటువైపు చూసే నాధుడే లేకుండాపోయారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. కుల, మత, పార్టీలనే భేదం చూడకుండా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని గొప్పలు చెప్పకుంటున్న పాలకులు పక్కాగృహాల దగ్గర నుంచి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల కోసం నెలల నుంచి ఏళ్ల తరబడి వేచిచూడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఇటీవల సిపిఎం నగర కమిటీ నిర్వహించిన ప్రజాచైతన్యయాత్ర దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలపై కథనం...

రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగరంలోని మృత్యుంజయకుంటను మౌలిక వసతుల కొరత పీడిస్తోంది. కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్‌లో మృత్యుంజయకుంట ఉంది. రెండు వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. కార్పొరేషన్, ఆర్టీసీ బస్టాండ్లకు కూతవేటు దూరంలో ఉంది. ఇక్కడ ఎక్కువగా నిరుపేదలు, పేదలు నివసిస్తున్నారు. పేదలు నివసిస్తున్న కాలనీ కావడంతో నాలుగున్నర దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. కార్పొరేషన్‌కు కూతవేటు దూరంలోని ప్రాంతాన్ని కార్పొరేషన్ యంత్రాంగం సిసిరోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య వంటి మౌలిక వసతులను అభివృద్ధి పరచాలి. పేదలు ఉన్న కాలనీ కావడంతో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది.

సిసి రోడ్లుకు ఎదరుచూపులు

మృత్యుంజయకుంట నిర్లక్ష్యానికి చిరునామాగా మారింది. కార్పొరేషన్ పాలకవర్గం, ఎమ్మెల్యే, ఎంపీ స్థాయి నాయకులు సైతం నాలుగు దశాబ్దాలుగా సిసి రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసిన పాపానికి పోలేదంటే అర్థం చేసుకోవాలి. ద్వారకానగర్, పటేల్‌రోడ్డు, ఓంశాంతినగర్ వంటి ప్రాంతాల వాసులతోపాటు ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్నారు. సదుపాయాల కల్పనలో శీతకన్నేయడం ఏమిటనే చర్చ నడుస్తోంది. నగర శివారు ప్రాంతాల్లో ఏర్పడిన జగనన్న కాలనీల కంటే అధ్వానంగా ఉండడమేమిటని ప్రశ్నిస్తున్నారు. మృత్యుంజయకుంటలో వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లోని వ్యర్థజలాలన్నీ లోతట్టు ప్రాంతంలోని ఇళ్లను ముంచెత్తుతున్నాయి. ఇరుకు వీధుల్లో రోడ్లు ఎత్తైన ప్రాంతంలో ఉండడంతో చిన్నపాటి వర్షం కురిస్తే ఇళ్లలోకి మురుగు నీటి ప్రవాహం ముంచెత్తుతోంది. కాలనీ వాసులు వర్షం, తుపాన్లు, అల్పపీడన ద్రోణుల పేర్లు వింటేనే హడలిపోతున్న దుస్థితి కనిపిస్తోంది.

ముంపు..కంపు...

మృత్యుంజయకుంటలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా కనిపిస్తోంది. స్థానికులే సొంత నిధులతో ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థతో మురుగునీటిని అనుసంధానం చేసుకున్న వైనం కనిపిస్తోంది. నగరంలోని ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రధానవాగు జమ్ము, చెత్తా చెదారం, దుర్గంధంతో దర్శనమిస్తోంది. మృత్యుయంజయకుంట ప్రధాన వాగు నుంచి ఆర్టీసీ బస్టాండు ప్రాంతానికి అనుసంధానించే వంతెనను రెవెన్యూ అధికారులు కూల్చేయడంతో మురుగునీటి మధ్యనే జీవనం సాగించాల్సి వస్తోందని బత్తల ప్రశాంతి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

ఆమడదూరంలో సంక్షేమం!

మృత్యుంయకుంట సంక్షేమానికి ఆమడదూరంలో నిలిచింది. మౌలిక వసతుల కల్పనలో వైఫల్యం సరే, సంక్షేమ పథకాల వర్తింపులోనూ వెనుకబాటే కనిపిస్తోంది. పక్కాగృహాలు మంజూరు మొదలుకుని వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లకు సైతం నోచుకోవడం లేదని స్థానికులు బి.లక్ష్మీదేవి అనే మహిళతోపాటు పలువురు వాపోతున్నారు. ప్రధాన వాగు ప్రాంతంలోని కొంతభాగాన్ని కబ్జా చేసి ప్రార్థనాలయాలు ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం గమనార్హం.

సిసి రోడ్డుకు మోక్షమేదీ

45 ఏళ్లుగా సిమెంట్ రోడ్డు అడుతున్నాం. ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన పాలకులు చేస్తామని హామీ ఇస్తున్నారే తప్పా చేయడం లేదు.

- నారాయణమ్మ, స్థానికులు, మృత్యుంజయకుంట.

ఏళ్ల తరబడి పక్కాగృహానికి నిరీక్షణ

15 ఏళ్లు పక్కాగృహాల మంజూరు కోసం నిరీక్షిస్తున్నాం. దరఖాస్తు చేసుకున్నాం. సచివాలయ ఉద్యోగులను అడితే రాలేదని చెబుతున్నారు.

- ఎన్.అయ్యవారమ్మ, స్థానికులు, మృత్యుంజయకుంట,

పింఛన్ రావడం లేదు

మూడేళ్లుగా పింఛన్ రావడం లేదు. గతంలో మా ఆయనకు పింఛన్ ఇచ్చేవారు. ఆయన పోయిన తర్వాత పింఛన్ ఇవ్వడం లేదు.

- వల్లెవ లక్ష్మీదేవి, స్థానికులు, మృత్యుంజయకుంట.

కనుల పండువగా

ధ్వజారోహణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కల్యాణానికి తలంబ్రాల తయారీ
- శేషవాహనంపై ఊరేగిన సీతారామలక్ష్మణులు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని పురాతన చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజా రోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణబట్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ఠాపన, ప్రాణప్రతిష్ఠ, నేత్రోల్మీలనం నిర్వహించామని చెప్పారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు పేర్కొన్నారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్టు వివరించారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.

తలంబ్రాలు ప్యాకింగ్ చేస్తున్న సేవకులు

కల్యాణానికి తలంబ్రాల తయారీ ప్రారంభం

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 11న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో ఆదివారం తలంబ్రాల తయారీ శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో టిటిడి ప్రారంభించింది. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పిఎసి వద్దకు తీసుకొచ్చారు. శ్రీ సీతా రామ కళ్యాణం కోసం తలంబ్రాల తయారీకి అవస రమయ్యే పసుపు వినియోగించేందుకు ఈ నెల 3న పసుపు దంచే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేసి, తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుండి శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు శ్రీవారి సేవకులు వచ్చారు. దాదాపు 425 మంది శ్రీవారి సేవకులు లక్షకు పైగా తలంబ్రాల ప్యాకెట్ల తయారీలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ ప్రశాంతి, పిఆర్ఒ (ఎఫ్ఎసి) నీలిమ, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, పాల్గొన్నారు.

విశేషంగా ఆకర్షిస్తున్న సంపూర్ణ రామాయణం సెట్టింగ్

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ రామాయణం సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇందులో రామాయణంలోని వివిధ ఘట్టాలను తెలియజేసే శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను ఉయ్యాలలో పవళింపజేస్తున్న దశరథుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయి, విశ్వామిత్ర మహర్షి యజ్ఞ రక్షణార్థం మారీచా, సుబాహు అనే రాక్షసులను సంహరిస్తున్న శ్రీరామ లక్ష్మణులు, జనక మహారాజు సభలో శివధనస్సు విరుస్తున్న శ్రీరామచంద్రుడు, సీతారామకళ్యాణ వైభోగం సెట్టింగులు ఆకట్టుకున్నాయి. సీతమ్మను అపహరిస్తున్న రావణాసురుడు, లంకకు వారధి కడుతున్న వానరసైన్యం, వనవాస కాలమున సూర్పనఖ అనే రాక్షసి ముక్కు చెవులను కోస్తున్న లక్ష్మణుడు, శ్రీరామ పట్టాభిషేకం తదితర కళాఖండాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆలయం లోపల, బయట వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో భక్తులను ఆకట్టుకునేలావినూత్నంగా అలంకరణలు చేశారు.

శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీసీతారామ లక్ష్మణులు

మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా సోదరుడు

అహమ్మద్ బాషా అరెస్టు

- ముంబయి ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న కడప పోలీసులు

- నేడు కడప కోర్టులో హాజరుపరిచే అవకాశం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ డిప్యూటీ సిఎం అంజద్ బాషా సోదరుడు అహమ్మద్ బాషాను కడప పోలీసులు ఆదివారం ముంబై ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. సోమవారం కడప కోర్టులో హాజరు పరచనున్నారు. కడపలోని వినాయక నగర్‌లో స్థలం విషయంలో జరిగిన దాడికి సంబంధించిన కేసులో అహమ్మద్ బాషాపై కేసు నమోదైంది. ప్రస్తుతం కడప ఎమ్మెల్యేగా ఉన్న మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి దంపతులను దూషించిన కేసులు అహ్మద్ బాషాపై ఉన్నాయి. అలాగే టిడిపి నేతలపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టారనే ఆరోపణలపై కూడా కేసులు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అహమ్మద్ బాషా జిల్లాకు దూరంగా ఉంటూ వచ్చారు. కానీ ఆయనపై నమోదైన కేసులకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే ప్రచారం జోరుగా కొనసాగింది. గత వారంలో రంజాన్ పండుగ నిమిత్తం అహమ్మద్ బాషా కడపకు వచ్చారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఆయన నివాసం వద్ద ఉండటంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే ఆలోచనతో పోలీసులు అరెస్టు చేయలేదు. శనివారం రాత్రి ముంబై నుంచి కువైట్ వెళ్లేందుకు విమానాశ్రయం చేరుకోగా, అప్పటికే లుక్ అవుట్ నోటీసులు ఆయన పైన జారీ కావడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కడప నుంచి పోలీసులు ముంబైకి బయలుదేరి వెళ్లి అహమ్మద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. ముంబై నుంచి రోడ్డు మార్గాన కడపకు తరలిస్తున్నారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. ఈనేపథ్యంలో అహమ్మద్ బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కడపలోని మరో పోలీస్ స్టేషన్‌లో కూడా అహమ్మద్ బాషాపై కేసు నమోదు చేశారు. ఆయనపై 232, 324, 506 సెక్షన్ల కింద కేసు నమోదైంది. సోమవారం ఉదయం కడప కోర్టులో అహమ్మద్ బాషాను హాజరపరిచిన తర్వాత మిగిలిన కేసులు పైన కూడా పిటి వారెంట్లపై అదుపులోకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతనిపైన సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారనే ఆరోపణలపై కూడా కేసులు ఉన్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆర్జెయుపి నాయకులు కోరారు. ఆదివారం నాయకుల బృందం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సంఘం అధికార ప్రతినిధి, సీనియర్ నాయకులు వీరబ్రహ్మం సారథ్యంలో వివిధ అంశాలపై చర్చించారు. స్పందించిన ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ నెల 7న పిజిఆర్ఎస్ హాలులో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా సభాభవన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఆ రహదారి కొత్తగా నిర్మించబడుతున్న కారణంగా, ఈ సోమవారం పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. **డయల్ యువర్ కలెక్టర్..** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'నాపై బురదజల్లడం బాధాకరం'

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు నిర్వహించిన రాష్ట్ర నాయకులు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక టెలి కాన్ఫరెన్‌లో ఇద్దరూ కడప నాయకులు సమావేశ విషయానికి సంబంధం లేకుండా తన పై బురద జల్లడం బాధాకరమని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 సంవత్సరాల నుంచి టిడిపి గెలుపే ధ్యేయంగా సర్పంచులు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లుగా గెలిపించేందుకు తాను, తన కుటుంబం అంకితభావంతో పని చేసిందని తెలిపారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్, వైసిపి ధమనకాండను ఐదేళ్ల ఎదురొడ్డి నిజా యితీగా టిడిపి కోసం పనిచేశామని పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా టిడిపి జిల్లా కార్యాలయానికి తమ వంతు సహకారం అందించామని తెలిపారు. మంత్రి లోకేష్ పాదయాత్రలో అధిక ప్రయాసలకు ఓర్చి ఇటు ఆర్థికంగానూ, వేలాది మంది కార్యకర్తలతో శక్తి మేరకు ఖర్చు చేసి పాదయాత్ర విజయవంతం చేశామని పేర్కొన్నారు. తన పని విధానాన్ని జిల్లా పార్టీ నాయకులే కాకుండా, రాష్ట్ర స్థయి నాయకులు ప్రశంసించారని పేర్కొన్నారు. ఇలా చేసిన తనను, తన కుటుంబాన్ని అన్యాయంగా కడప నాయకులే బురద జల్లడం దారుణమని వాపోయారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ ప్రతిష్టకు, తమ గౌరవానికి ఎలాంటి భంగం రాకుండా మాట్లాడతారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఎన్‌టిఆర్ వైద్య సేవలు బంద్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్‌టిఆర్ వైద్య సేవల పథకం కింద వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులు సోమవారం నుంచి నిలిపివేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) వైద్య సేవలు నిలిపివేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3,500 కోట్లు బకాయి రావాల్సి ఉంది. ముఖ్యమంత్రి, ఎన్‌టిఆర్ వైద్య సేవల ట్రస్ట్ సిఇఒ అధికారులు, మంత్రుల దృష్టికి ఆర్థిక కష్టాలు తీసుకువెళ్లిన స్పందించకపోవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆషా ప్రతినిధులు తెలిపారు.

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి కడప అర్బన్

నగరంలోని లక్ష్మీనగర్‌లో ఉన్న టిడ్కో ఇళ్లకు రోడ్డు పనులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఆదివారం టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ఉన్న టిడిపి హయాంలో ఇళ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా 2,432 టిడ్కో ఇళ్లను ప్రజలకు పంపిణీ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇళ్లను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందిస్తామని చెప్పారు. పేదలకు సొంత ఇంటి కల నిజం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రోడ్డు పనులు పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదలను విస్మరించిందని విమర్శించారు. చెక్కులు కట్టిన అనేకమంది ఇళ్ల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డయ్య యాదవ్, నవనీశ్వర్‌రెడ్డి, షరీఫ్, రమణారెడ్డి, వినోద్, వినోద్ కుమార్‌రెడ్డి,శివ శంకర్,రాయుడు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

- ఎంబిసి రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని ఎంబిసి రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం ఎంబిసి స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేదరికం, కరువు, విద్యా, వైద్యం, ఉపాధి సమస్యలు ఉండగా ఎంతసేపు ముస్లిముల మీద ఆంక్షలు, నిబంధనలు, చట్టాలు, ఇబ్బందులకు గురిచేసేది మోడీ ఎజెండాగా మారిందని విమర్శించారు. అందులో బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాక్, ఎఆం సి, గోమాంస నిషేధం, గుడుల ముందు హలల్ ఇలా అనేక విషయాలపై ఇబ్బందులకు గురి చేసి 80 శాతం ఉన్న హిందూ సోదరుల మెప్పు పొందాలనుకోవడం అవివేక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయం, దేశంలో దాదాపు 9 వేల లక్షల ఎకరాలు వక్ఫ్ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 15 శాతం ఉన్న మైనారిటీలకు అభద్రత కల్పించే ఈ బిల్లు మైనారిటీల ఆస్తులుపై ప్రభుత్వ జోక్యం చేసుకొనే ఈ బిల్లు ముస్లిముల స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందని పేర్కొన్నారు. ఆర్టికల్ 13, 14, 25, 26 మతస్వేచ్ఛను కల్పించిందని తెలిపారు. వక్ఫ్ బోర్డు 1954 నుంచి అమలులో ఉందని, అప్పటి నుంచి అనేక మార్లు చిన్న చిన్న సవరణలు ముస్లిం మత పెద్దలు, మత గురువుల సలహాల మేరకు చేశారని చెప్పారు. కాని ఎన్‌డిఎ ప్రభుత్వం ముస్లిం గురువుల జోక్యం లేకుండా ఏక పక్షంగా స్వార్థంతో కుట్ర పూరీతంగా ఈ బిల్లును అమోదించడం ప్రజలు ఎవరు హర్షించరని తెలిపారు. రాష్ట్రంలో 12శాతం ఉన్న మైనారిటీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన ఈ బిల్లు కు అనుకూలంగా ఓటు వేయడం సిగ్గుసేటని విమర్శించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయమని చెప్పిన మాజీ సిఎం జగన్ మోహనరెడ్డికి ఎంబిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాలా పెద్దన్న, ప్రచార కార్యదర్శి నాగూరు కుళాయిప్ప, జిల్లా సెక్రటరీ రెడ్డయ్య, దూదేకుల సంఘ నాయకులు దస్తగిరి, సుబ్బయుడు, నూర్ బాషా, మహమ్మద్ పాల్గొన్నారు.

అద్భుత ప్రయోగాలు 'పీస్' విద్యార్థులకే సాధ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులను అభినందిస్తున్న గౌస్‌పీర్

నగరంలోని మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్‌పీర్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు సైన్స్ ఫెయిర్ లో పాల్గొని తమ మేధోశక్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అబ్బురపరిచే విధంగా తమ ప్రతిభతో ఉత్తమ ప్రయోగాలు చేయడం ప్రశంసనీయమన్నారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ చూపించిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ అభినందిస్తూ ప్రశంసించారు. ప్రముఖ కవి వేంపల్లె షబ్బీర సైన్స్ ఫెయిర్‌లోని ప్రాజెక్టులను తిలకించి అద్భుతంగా చేసిన విద్యార్థులను, స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

రూ.10 కోట్లతో ప్రతిపాదనలు అందజేత

రూ.4,500 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటుకు సర్వే

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కె.ఏడుకొండలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తాం. 2025 ఆర్థిక సంవత్సరానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు అందజేశాం. జిల్లాలోని 35 మండలాల పరిధిలోని తాగునీటి వనరులైన చేతిపంపులు, బోర్లు, సిపిడబ్ల్యు స్కీముల పనితీరును పరిశీలించడమైంది. జిల్లాలో తీవ్ర ప్రభావిత హ్యాబిటేషన్లు గుర్తించాం. జిల్లాలోని 234 గ్రామాల్లో ట్రాన్స్‌పోర్టేషన్ సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని భావించాం. ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలకు తాగునీటి ఎద్దడి నివారణలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన టిటిడితో కలిసి పర్యవేక్షణ చేస్తున్నాం. ఈమేరకు జిల్లాలోని ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలతో కలిసి సంయుక్తంగా తాగునీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించడమైందని పేర్కొంటున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కె.ఏడు కొండలుతో ముఖాముఖి...

తాగునీటి వనరుల వివరాలు తెలపండి?

జిల్లాలోని 35 మండలాల్లో 549 పంచాయతీలున్నాయి. ఇందులోని 1,922 హ్యాబిటేషన్ల పరిధిలో 2,219 చేతింపులు, 2,800 పిడబ్ల్యుఎస్, ఎంపిడబ్ల్యుఎస్, డిపి స్కీములు, 13 సిపిడబ్ల్యు స్కీములు ఉన్నాయి.

తాగునీటి ఎద్దడి బడ్జెట్ ప్రతిపాదనలు చెప్పండి?

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.10 కోట్లకు ప్రతిపాదనలు అందజేశాం. ఈఏడాది జనవరి నుంచి జూన్ వరకు నిధులను ఖర్చు చేసే అవకాశం ఉంది. తాగునీటి బోర్ల ఫ్లెస్సింగ్, హైరింగ్, ఫ్లస్సి ంగ్, డీపె నింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ చేయడానికి ఖర్చు చేయాల్సి ఉంది.

జిల్లా వాటర్‌గ్రిడ్ ఏర్పాటు గురించి తెలపండి?

జల్‌జీవన్ పథకం కింద జిల్లాలోని మైలవరం, బ్రహ్మంసాగర్, గండికోట, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల నుంచి రూ.4,500 కోట్లతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకుఅనుగుణంగా సర్వే చేసి నివేదికను అందించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులోభాగంగా ఆర్‌వి అసోసియేట్స్ ఏజెన్సీ సహాయంతో నెలాఖరు నాటికి సర్వే పూర్తి చేయడంపై దృష్టి సారించాం.

పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల గురించి తెలపండి?

రూ.460 కోట్లతో పులివెందుల వాటర్‌గ్రిడ్ పనులు చేపట్టాం. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల పరిధిలో 299 హ్యాబిటేషన్స్‌కు తాగునీటిని అందించడానికి కసరత్తు చేస్తోంది. మేఘా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టు సంస్థ పనులను చేపడుతోంది. ఇప్పటికి 75 శాతం పనుల్ని పూర్తి చేసింది. ఈయేడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి తెస్తాం.

సిపిడబ్ల్యుఎస్ స్కీములు ఎన్ని పని తీరు?

15 సిపిడబ్ల్యు స్కీములున్నాయి. ఇందులో ఒంటిమిట్ట సిపిడబ్ల్యు స్కీము వరద ముంపులో మునిగిపోయిన నేపథ్యంలో పని చేయడం లేదు. మాధవరం సిపిడబ్ల్యుస్కీమ్ పంచాయతీకే అప్పగించడం జరిగింది. దీంతో 13 స్కీములు పని చేస్తున్నాయి. 477 హ్యాబిటేషన్ల పరిధిలో 3,74, 152 మందికి తాగునీటిని అందించే ప్రయత్నం చేస్తున్నాం.

సిపిడబ్ల్యు లెస్ టెండర్లపై ఎలా వ్యవహరిస్తారు?

సిపిడబ్ల్యు స్కీములకు లెస్ టెండర్లు వేసిన మాట వాస్తవమే. రెండు, మూడ్రోజుల్లో పూర్తిస్థాయిలో టెండర్లు ఓపెన్ చేస్తాం. లెస్ వేసిన కాంట్రాక్టర్ల నుంచి 35 శాతం నిధులను సెక్యూరిటీ డిపాసిట్ చేయించుకుంటాం.

జల్‌జీవన్ పనుల పురోగతి ఎలా ఉంది?

రూ.170.11 కోట్లతో జల్‌జీవన్ స్కీమ్ పనులు చేపట్టడమైంది. ఈమేరకు 2,521 పనులు చేపట్టడం జరిగింది. ఇందులో 90 శాతం పనులు పూర్తి చేశాం. జిల్లావ్యాప్తంగా రూ.26.87 కోట్లతో 26,094 ఇళ్ల కు కుళాయి కలెక్షన్స్ ఇవ్వాల్సి ఉంది. ఇందులో 13,647 కుళాయి కలెక్షన్లు ఇవ్వడం జరిగింది.

వీధిలో పారుతున్న మురుగునీరును తొలగించి, పారేలా చర్యలు తీసుకున్న అధికారులు

రోడ్డుపై మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఉన్న మురుగునీరును అధికారులు తొలగించారు. ఈనెల 4న 'ప్రజాశక్తి'దినపత్రికల్లో 'రోడ్లపై మురుగునీరు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు. రోడ్లపై ఉన్న మురుగునీరు తొలగించారు. అమ్మవారిశాల వెనుక వీధిలో ఉన్న మురుగు కాలువలో నీరు పోయేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు వ్యాపారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రక్తదాన కార్యక్రమంలో యువత, సంస్థ ప్రతినిధులు

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని చెన్నముక్కపల్లె పంచాయతీ ఆంజనేయపురం గ్రామంలో జే బి వి ఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం ఆదివారం విజయవంతమైంది. పెద్ద ఎత్తున యువత రక్తదానం చేశారు. ఎన్ ఎస్ఎస్ వాలంటీర్ అశోక్ మాట్లాడుతూ.. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం ఎంతో అవసరమన్నారు. రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. రక్తదానం పట్ల యువత అపోహలు వీడాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి వైస్ ప్రెసిడెంట్ కళావతి, కార్తీక్‌రెడ్డి, చంద్రమౌళిరెడ్డి, పోలయ్య, రక్త కేంద్ర నిల్వ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మొదటి బహుమతి సాధించిన ఎడ్లు

నరసాపురంలో ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురం రాములోరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఎడ్ల పందేలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలో ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కామిని చంద్రమోహన్‌రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి మన్నేటి కృష్ణారెడ్డి ఎడ్లు సాధించాయి. వరుసగా అయిదు బహుమతులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మహిళలు, పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైజిఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యర్రనాగు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. తన నానమ్మ వెంకటసుబ్బమ్మ రెండవ వర్ధంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా మండలంలోని నంద్యాలంపల్లె ఘాటు వద్ద నివాళి అర్పించారు. అనంతరం మంగపట్నం వద్ద ఉన్న అనాథ శరణాలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైజిఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలో నివాసం ఉంటున్న కల్లూరి సౌభాగ్యతోపాటు డ్రైవర్ శివకృష్ణపై కొందరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఆరుమందిని నిందితులను ఖాజీపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ ఆర్ మోహన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత నెల 31న కడపకు చెందిన కొందరు వ్యక్తులు సౌభాగ్య నివాసానికి వచ్చారు. కడపకు చెందిన ఓబుల్‌రెడ్డి, సౌభాగ్యమ్మ మధ్య డబ్బు, ఇతర వివాదాలు ఉండేవన్నారు. ఈ క్రమంలో ఓబుల్ రెడ్డి ఇంటికి చెందిన తాళాలు సౌభాగ్య వద్ద నుంచి తెప్పించుకోవడం కోసం కడపకు చెందిన సయ్యద్ మహమ్మద్ గౌస్, గోగుల వసంత్, కొండల బబ్లూ, చిల్లతోటి ఆకాష్‌కుమార్, రమేష్ మరో మైనర్ వచ్చారన్నారు. సౌభాగ్యపై దాడి చేసి ఇంటికి చెందిన తాళాలు తేవాలని ఓబుల్‌రెడ్డి పురమాయించారని సిఐ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం కడప నగరంలోని ఇర్కాన్ సర్కిల్ వద్ద వారిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, మూడు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు సిఐ వివరించారు.

నిందితులతో సిఐ మోహన్, పోలీసులు

విరివిగా దనియాల సాగు

మూడేళ్ల తర్వాత రైతుల్లో ఆసక్తి-ఆశాజనకంగా ధరలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతులు దనియాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంత నేలలు అనుకూలించడంతో ప్రతి రైతు ఎంతోకొంత విస్తీర్ణంలో దనియాల పంట వేయడం అలవాటు. గత కొంతకాలంగా ధరలు సరిగా లేకపోవడంతో సాగుకు రైతులు స్వస్తి పలికారు. ఇప్పుడు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో దనియాల సాగుపై మక్కువ చూపుతున్నారు. అతి సులువుగా దిగుబడి వచ్చే పంటల్లో దనియాల కూడా ఒకటి. కేవలం 70రోజుల వ్యవధిలో దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. సస్యరక్షణ చర్యలు కూడా తక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. పూతదశలో పూత మగ్గిపోకుండా కేవలం గంధకం చల్లితే చాలు దిగుబడి సజావుగా వస్తుందని రైతులు తెలిపారు. ఎకరా సాగు ఖర్చు సుమారు రూ.30 వేలు వస్తుందని వివరించారు. కాపు బాగా వస్తే ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దనియాలు తయారవుతాయని రైతులు పేర్కొన్నారు. దిగుబడి ఇళ్లు చేరేవరకు గిట్టుబాటు ధర ఇలాగే ఉంటే రైతులకు కాస్త ఊరట లభిస్తుంది.

కాలువలు ద్వారా నీరు కూడా అందుబాటులో ఉన్న కారణంగా రైతులందరు నీటి వసతిపై ఆధారపడి దనియాల పంటను సాగు చేస్తున్నారు. రైతులకు ప్రకృతి సహకరించాలని ఆశిద్దాం.

శ్రీరాముని జీవితం.. ఆదర్శం, మార్గదర్శకం

శ్రీరామనవమి వేడుకల్లో తులసిరెడ్డి దంపతులు

ప్రజాశక్తి - వేంపల్లె

శ్రీరామచంద్రుడు ఆదర్శ పురుషుడని, ఆయన జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు. కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, నాగరాజు, రమణ పాల్గొన్నారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం వేంపల్లెలోని టీచర్స్ కాలనీలో ఉన్న శ్రీరామ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి సీతారాములకు వస్త్రాలను అందజేశారు.

సిద్ధారెడ్డిపల్లెలో నిర్వహిస్తున్న రాములోరి కల్యాణం

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

చాపాడు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సీతారాముల కల్యాణాన్ని వైభవంగా తిలకించారు. సిద్ధారెడ్డిపల్లె, నాగాయపల్లె, విశ్వనాథాపురం, చాపాడు, చియ్యపాడు, గుంతచియ్యపాడు, లక్ష్మీపేట, శ్రీరాములపేట తదితర గ్రామాల్లో కల్యాణాన్ని కనులపండువలా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లో గ్రామోత్సవాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు. **మైదుకూరులో..** మైదుకూరు పట్టణం, మండల పరిధిలో అన్ని సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. నంద్యాల రోడ్డులోని పాతూరులో కల్యాణం నిర్వహించి, అన్నదానం చేశారు. పార్వతీనగర్‌లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కడప రోడ్డులోని ఆర్ఇఎస్ జూనియర్ కళాశాల సమీపంలోని రామాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

పానకాన్ని పంపిణీ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల వద్ద ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం, వడపప్పు, పానకాల పంపిణీ చేశారు. వైసిపి మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పట్టణంలోని శ్రీనివాస థియేటర్ సమీపంలో మెకానిక్ శేఖర్ ఆధ్వర్యం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం నగరిగుట్ట శ్రీరామాలయంలో, గర్ల్స్ హై స్కూల్ సమీపంలో ఉన్న రెండు దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కోడి రమణ, పట్టణ ఉపాధ్యక్షులు పార్నపల్లి కిషోర్, కో-ఆప్షన్ చంద్రమౌళి, నాయకులు అరిశెట్టి రవి, బాటరీ ప్రసాద్, చెన్నారెడ్డి, ఎర్రచంద్ర పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : శ్రీరామనవమి సందర్భంగా వేంపల్లి రోడ్డులో నూతనంగా వెలసిన సీతారాముల ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య ట్రాన్స్‌పోర్ట్ అధినేత సానేపల్లె ప్రసాద్‌రెడ్డి 2000 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. సీతారాముల వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పట్టణ సీఐ నరేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తుపాకుల చంద్రఓబులరెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో పానకం, వడపప్పు పంపిణీ

కడప అర్బన్ : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని కడప శిల్పారామంలో ఎఓ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజలకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం బిల్టప్ సర్కిల్ వద్ద ఉన్న స్ప్రౌట్ వాలీ ఇంటర్నేషనల్ స్కూల్ వారిచే నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో శిల్పారామం ఫీల్డ్ సూపర్వైజర్ పి.మధుసూదన్ బాబు పాల్గొన్నారు.

నిలిచిపోయిన డ్రెయినేజీ పనులు

ఇళ్లకు మార్కింగ్ వేస్తున్న అధికారులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో జరుగుతున్న డ్రెయినేజీ పనులు నిలిచిపోయాయి. గత వైసిపి ప్రభుత్వ పాలనలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో కొద్దిరోజులు పనులు ప్రారంభం కాలేదు. పెండింగ్ పనులు ప్రారంభించేందుకు కూటమి నాయకులు, అధికారులు కాంట్రాక్టర్లతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఆ పనులను ప్రారంభించారు. ఆయా పనులు కొద్ది రోజులపాటు కడప రోడ్డులో చకచకా జరిగాయి. డ్రెయినేజీ పనులు చేసేందుకు వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న కొన్ని గృహాలు రోడ్డు పరిధిలో ఉన్నాయని, వాటిని పగుల కొట్టాలని రోడ్డు భవనాల శాఖ అధికారులు కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చారు. ముందు అధికారులు మార్కింగ్ వేసిన చోటికి పగులగొట్టి ఇళ్లను మరమ్మతులు చేసుకున్నామని, మళ్లీ మార్కింగ్ వేసి గృహాలను పగులగొట్టాలని చెప్పడం ఏమిటని స్థానికులు అధికారులతో చెప్పారు. ప్రభుత్వం నుండి పరిహారం తీసుకున్నందున రోడ్డు పరిధిలో ఉన్న గృహాలను తొలగించాల్సిదేనని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మార్కింగ్ వేసిన చోటికి తొలగిస్తే డ్రెయినేజీ పనులు చేసేందుకు వీలుంటుందని చెప్పినా, అధికారుల ఆదేశాలను వారు లెక్కచేయడంలేదు. ఈ నేపథ్యంలో ఇళ్ల యాజమానులు కూటమి నాయకుల వద్దకు వెళ్లి అధికారులు మార్కింగ్ వేసిన విషయాన్ని వివరించారు. ఇందుకు స్పందించిన కూటమి నాయకులు ఇళ్ల యాజమానులకే మద్దతు పలికినట్లు సమాచారం. అధికారులు మార్కింగ్ వేసిన చోటికి యాజమానులు గృహాలను తొలగించిక పోవడంతో డ్రెయినేజీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. పనులు మధ్యలోనే ఆపేయడంతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వం నుండి నష్టపరిహారం తీసుకొని కూడా గృహాలను తొలగించక పోవడం దారుణమని పలువురు అంటున్నారు. అధికార పార్టీ నాయకులు ఇలాంటి విషయంలో జోక్యం చేసుకోకుండా అభివృద్ధి పనులు సజావుగా జరిగేలా చూడాలని కోరుతున్నారు. కూటమి నాయకులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకొని అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామ పంచాయతీలో గత వైసిపి ప్రభుత్వంలో ప్రారంభించిన వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. డిజిటల్ లైబ్రరీని రూ.16 లక్షల వ్యయంతో 690 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే ఏర్పాట్లు చేపట్టారు. వర్క్ ఫ్రం హోం విధానాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు అనంతరం మౌలిక సదుపాయాల కల్పన కోసం కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దశల వారీగా ప్రతీ గ్రామ పంచాయతీలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అప్పటిలో కొన్ని ప్రాంతాల్లో లైబ్రరీలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వ నిధులు వృథాగా మారనున్నాయి. ఇప్పటికైనా అసంపూర్తిగా నిలిచిపోయిన భవణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లవోలులో అసంపూర్తిగా ఉన్న డిజిటల్ లైబ్రరీ

పెద్ద గుంతలతో ఉన్న మోట్నూతలపల్లి రోడ్డు

అధ్వానం మోట్నూతలపల్లి రోడ్డు

మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజల విన్నపం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మోట్నూతలపల్లి రోడ్డు నరకాన్ని తలపిస్తోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీకి 7కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి రెండువైపులా రోడ్లు దెబ్బతిన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పెద్దపెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగాల మండలంలోని పలు గ్రామాలు, పులివెందుల మండలంలోని పలు గ్రామాలు ఈ దారి నుంచి మోట్నూతలపల్లి మీదుగా కనంపల్లి వద్ద ఉన్న బెంగళూరు హైవే చేరుకునేందుకు వీలుగా ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి అరటి ఇతర వ్యవసాయ సంబంధ పండ్లు కదిరి, బెంగళూరు తదితర ప్రాంతాలకు జీపుల ద్వారా తరలిస్తుంటారు. వ్యాపారులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయాలనే ఆలోచన ఎవరికీ లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన పులివెందులకు మోట్నూతలపల్లి గ్రామ ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ద్విచక్ర వాహనాలు, ఆటోలలో ప్రయాణిస్తుంటారు. ఈ ప్రాంతంలో అధిక శాతం రైతులు అరటి పంటను పండిస్తారు. వాటి ఎగుమతులకు లారీలు, ఐచర్ వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. పలువురు రైతులు పొలాల అవసరం కోసం వాహనాలను ఉపయోగిస్తుంఆరు. కంకర తేలి మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. బైక్‌లు పలు సందర్భాల్లో అదుపుతప్పి కిందపడుతున్నారు. రాజకీయ నాయకులు వీటి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలానికి పరిరక్షణ కరువు

తాగునీటి పథకాల చుట్టూ అపరిశుభ్రత

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవలాలు ప్రభుత్వ కాలనీ వద్ద 7 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ప్రయివేట్ వ్యక్తులు తమ ఆక్రమణలో ఉంచుకున్నారు. ఈ స్థలంలో మంచినీటి పథకానికి సంబంధించి ఓవర్ హెడ్ ట్యాంక్, చేతి పంపు ఉన్నాయి. వీటి ఆవరణ అపరిశుభ్రతతో నిండి ఉంది. గతంలో ప్రభుత్వం 36మంది పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. ఈ ప్రాంతంలో 7 సెంట్లు స్థలం ప్రధాన రహదారికి పక్కనే మిగులుగా ఉంది. ఇదే అదునుగా ఈ స్థలానికి పక్కన ఉన్న వ్యక్తులు దాన్ని ఆధీనంలో ఉంచుకొని వారి కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. మంచినీటి పథకం వద్ద అపరిశుభ్రతను గుర్తించి పంచాయతీ సిబ్బంది నోటీసులు కూడా జారీ చేశారు. అయినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేదు. ఈ స్థలాన్ని సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకుని సద్వినియోగం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ స్థలానికి సంబంధించి గ్రామ సర్పంచ్ కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంచాయితీ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటే గ్రామ పంచాయితీ, దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అల్లాడుపల్లె వద్ద బాడుగ రూములకు మంచి డిమాండ్ ఉందన్నారు. మంచినీటి పథకం ఆవరణలో అపరిశుభ్రతపై ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణితో మాట్లాడగా.. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని, అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మిగులు స్థలాన్ని పంచాయితీకి కేటాయించడం తమ పరిధిలో లేదని తెలిపారు.

మంచినీటి పథకం చుట్టూ నెలకొన్న అపరిశుభ్రత

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. శ్రీ కోటం వినోద్ కుమార్ రెడ్డి, తండ్రి: కె.రమణా రెడ్డి, డోర్ నెం: 1-73, రాచయ్యపేట, గోపవరం, గోపవరం ప్రాజెక్ట్ సైట్, వై.ఎస్.ఆర్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్-516233. **2. శ్రీమతి బోడేపూడి శారద,** భర్త: శ్రీ వెంకటరావు, ఫ్లాట్ నెం: 505, 5వ అంతస్తు, డోర్ నెం: 2-29, సాయి నివాస్ అపార్ట్‌మెంట్, వేల్పూర్ రోడ్డు, గూడవల్లి గ్రామం, విజయవాడ రూరల్, ఎన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-521104.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ కోటం వినోద్ కుమార్ రెడ్డి కి చెందిన బకాయి వసూలు కొరకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.05-05-2021** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.06-09-2021**న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.05-05-2021** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
ఆంధ్రప్రదేశ్, ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, గూడవల్లి గ్రామం మరియు గ్రామపంచాయితీ, సాయి నివాస్ అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తులోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం:406 యొక్క మొత్తం భాగం 1022 చ.అ.లు (800 చ.అ.ల ప్లింత్ ఏరియా & 222 చ.అ.ల కామన్ ఏరియా) మరియు 140 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా, డి.నెం.2-136లో 1923 చ.గ.లు లేదా 1607.87 చ.మీ.లలో (పాత ఆర్.ఎస్.నెం: 42/4, ప్రస్తుత ఆర్.ఎస్.నెం: 42/3సి) నిర్మించబడింది, ఇది 54.25 చ.గ.లు లేదా 45.360 చ.మీ.ల విభజించబడని ఉమ్మడి వాటాకు హద్దులు: **తూర్పు:** శూన్యాకాశము, **దక్షిణం:** శూన్యాకాశము, **పడమర:** సాధారణ కారిడార్ మరియు మెట్లు, **ఉత్తరం:** శూన్యాకాశము మరియు లిఫ్ట్. ఎస్.ఆర్.ఓ గుణదల వద్ద తేది.03.12.2018, రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.7821/2018 ప్రకారం. గూగుల్ కోఆర్డినేట్స్: 16.508113, 80.7511030.

తేది: 27-03-2025
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా